# సహాయం

"ఓర్నాయనోయ్"

గుండెలదిరేలా కేక పెట్టింది నాగమ్మ.

మూటలా చెట్టుమీదినుంచి కిందికి పరవళ్ళు తొక్కుతూ పరుగులు తీస్తోన్న నీళ్ళలోకి జారిపోయింది ముసిల్ది!

పిల్లలిద్దరూ వణికిపోయి తల్లిని కౌగలించుకున్నారు.

"ఏమిటయ్యింది?" కంగారుగా అడిగాడు రాజయ్య చీకట్లను చీల్చుకుని చూస్తూ.

చెప్పలేదు నాగమ్మ.

ఇంకా అరుస్తూనే వుంది.

అప్పుడుగానీ రాజయ్య గమనించలేకపోయాడు - తన తల్లి-ముసిల్ది ఆ చెట్టుమీద కొమ్మలమధ్య లేదని.

గుండె జారిపోయింది.

"అమ్మేదే?"

"ఓర్నాయనోయ్.... చెట్టు మీద్నుంచి జారిపోయింది" ఏడుస్తూ చెప్పింది నాగమ్మ.

రాజయ్య దిగ్గున కిందకి చూశాడు.

అంతా చీకటి.

ఏమీ కనిపించటం లేదు.

అస్పష్టంగా పరుగులు దీస్తున్న నీళ్ళు కనిపించాయి. కనుచూపు మేర అంతా నల్లగా అగుపడుతోంది.

ముసిల్దాని జాడలేదు.

ఇంకెక్కడి ముసిల్ది? ఒకటా? రెండా? దాదాపుగా డెభైయేళ్ళు దాటిపోయిన మనిషి నీళ్ళలో పడటంతోనే భయంతోనూ, సగం గుండాగి చచ్చి నీళ్ళలో కొట్టుకుపోయింది.

గాలి రివ్వున కొడుతోంది. గంటకు నూటనలభై కిలోమీటర్ల వేగంతో గాలివీస్తుందని ఆ క్రితంరోజు సాయంత్రంనించే ఆకాశవాణి హెచ్చరికలు చేసింది. పెద్ద పెద్ద చెట్లు- ఇళ్ళు- టెలిఫోన్ స్తంభాలు విరిగి పడతాయనికూడా హెచ్చరికలు వెలువడ్డాయి.

సముద్ర తీరప్రాంతంలో వున్న వాళ్ళందరినీ సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తుఫాన్నించి రక్షణ ఇవ్వటానికి ఎన్నో ముందు జాగ్రత్త చర్యలను తీసుకుంది ప్రభుత్వం.

ఎన్ని చర్యలు తీసుకున్నా రాజయ్య కుటుంబం- అట్లాగే మరికొంత మంది తుఫాన్కు దొరికిపోయారు.

చిమ్మ చీకటి.... వుండి వుండి మెరుపులు మెరుస్తున్నాయి. అలా మెరుస్తున్నప్పుడల్లా పరిసరాలన్నీ తళుక్కుమంటున్నాయి.

ఝంయ్‌మన్న మోతలో సుడులు తిరుగుతూ దూసుకువస్తోంది ఈదురుగాలి. ఏదో రాక్షస హస్తం పట్టి వూపినట్టు వూగిపోయింది వాళ్ళంతా ఎక్కి కూర్చున్న చింత చెట్టు....

కొమ్మలను గట్టిగా వాటేసుకున్నాడు రాజయ్య.

చలిగాలి వాళ్ళను నిలువునా కత్తితో కోస్తున్నట్లుగా విలవిల్లాడిపోయారు.

కొంచెం దూరంలోనే ఫెళఫెళ మంటూ చప్పుడయ్యింది. చివుక్కున ఆ వైపుకు కళ్ళు చిట్లించి చూశారు

రావిచెట్టు విరిగి ఒరిగినీళ్ళలోకి పోతున్నది....దానిమీద పక్షులన్నీ ఒక్కసారి గట్టిగా అరిచాయి.

గాలిహోరు.... సముద్రం పొంగి మీదికి వస్తున్నట్లుగా ఒకటే హోరు.... వర్షం.... చినుకులు గాలి విసురుకు వగిలి సూదుల్లా సన్నటి రాళ్ళలా వేగంగావచ్చి మొహానికి గుచ్చుకుంటున్నాయి.

పిల్లలు బాధతో అరుస్తున్నారు.

రాజయ్య గుండె జారిపోయింది....

"అమ్మో.... అమ్మో...." ఇంకా యేడుస్తూనే వున్నాడు ...

ఓదారుస్తోంది నాగమ్మ....

"ముదనష్టపు తుఫాను.... మన ప్రాణాలు లాగేసుకొటానికే ముంచుకొచ్చింది.... మాఁవా.... మనం కూడా ఈ తుఫానుకు బలి అయిపోతాం...."

రాజయ్యను ఓదారుస్తూనే ఏడుస్తోంది నాగమ్మ.... తుఫాన్ని తిడుతోంది....

తిడుతున్న కొద్దీ కోపం పెరిగిపోతున్నట్లుగా గాలి ఉధృతం నిమిషనిమిషానికీ మరింతగా పెరిగిపోతోంది.... ఆ హోరు చెవులను బద్దలు కొడుతోంది.

ఆ సాయంత్రం వరకు చిన్నగా చినుకులు పడుతూనేవున్నాయి. సన్నగా చలిగాలి వేస్తోంది.

రేడియోలో తుఫాన్ గురించిన హెచ్చరికలు వస్తూనేవున్నాయి.

ఆ గూడెంలో మనుషులు పిల్లలతో పొద్దువాలిపోతున్నప్పుడే మైలు దూరంలో వున్న వూళ్ళోకి వెళ్ళిపోయారు. వాళ్ళంతా వెళుతూ రాజయ్యను రమ్మన్నారు.... నాగమ్మకూడా వెళదామనే అన్నది.

కాని రాజయ్య? తల్లి ముసల్ది.... కదిలే స్థితిలోలేదు. తాను రాలే నన్నది.... రాజయ్యకు కూడా గూడెం వదిలి వూళ్ళోకి వెళ్ళటం ఇష్టం లేకపోయింది. ఆ క్రితం రోజునే తన గుడిసెను వూడదీసి బాగా వేసుకున్నాడు.... గట్టి గోడలు ఇటుకలతో కట్టాడు.... ఆఇంటిని వదిలి వెళ్ళబుద్ధి కాలేదు.

'ఈ రేడియోలో ఇట్టాగే చెబుతారు. ఇప్పుడు తుఫాను ఏడ్నించి వచ్చేది?' అంటూ నవ్వేడు.

రాజయ్య మొండివాడని ఆ గూడెంలో అందరికీ తెలుసు. అంతే కాదు. ఒకసారి ఇట్టాగే తుఫాన్ గురించి రేడియోలో నిమిషనిమిషానికీ హెచ్చరిక చేశారు. ఆ హెచ్చరికలు విని భయపడి గూడెంలో వాళ్ళందరూ ఇళ్ళ నొదిలి పెద్ద వూళ్ళోకి వెళ్ళిపోయారు. ఆ రాత్రంతా అక్కడే వున్నారు. రేడియో చెప్పినంత భీభత్సంగా తుఫాన్ రాలేదు. బాగా వర్షం పడింది.

తెల్లారి గూడెంలోకి వచ్చారు. కొంతమంది ఇళ్ళ తలుపులు తెరచి వున్నాయి. ఎవరో దోచుకుపోయారు. పశువులను తోలుకు పోయారు. రాజయ్య మేకలను మూడింటినీ తోలుకెళ్ళారు.

ఈ అనుభవం అతనికి బాగా గుర్తుంది. ఈసారి అతనికి రెండు మేకలతోపాటు ఒక గేదెకూడా వుంది. దానికో దూడ.... వీటన్నింటినీ వదిలి వూళ్ళోకి వెళితే, తుఫాను రాకపోతే పోయినసారిలాగానే అవు తుందనుకున్నాడు.

అందుకే నాగమ్మ గూడెం వదిలి సురక్షిత ప్రాంతానికి వెళదా మని ఒత్తిడి చేసినా రాజయ్య ఒప్పుకోలేదు.

తలుపులు బిగించి ఆ ఇంట్లో మూలగా అంతా కూర్చున్నారు. మూగజీవాలను బయట కొయ్యకు కట్టేశారు.

నిమిషనిమిషానికీ గాలి జోరు పెరిగింది.... వర్షం పెరిగి పోయింది. మూడు గంటలు గడిచిపోయాయి.

రాజయ్య చుట్ట వెలిగించాడు. పొగ వదులుతూ బయటపడు తున్న వర్షం గురించి ఆలోచనలో మునిగిపోయాడు. నాగమ్మ తుఫాన్ గురించే ఆలోచిస్తోంది. ఆమెకు మనసులో ఏదో భయంగా, దిగులుగా వుంది. ఆమె ఏదో కీడును శంకిస్తూనే వుంది. రాజయ్య మొండితనం తమ ప్రాణాలు తీస్తుందేమోననే ఆందోళన ఆమె మనసులో ముల్లులా క్షణక్షణానికీ గుచ్చుకుంటూనే వుంది.

ముసిల్ది కుక్క మంచంలో ముణగదీసుకుని పడుకుంది. చలికి వణుకుతుంటే రెండు చినిగిపోయిన దుప్పట్లను కప్పింది నాగమ్మ....

పిల్లలిద్దరూ కింద గోనెపట్టాలు పరుచుకుని పడుకున్నారు. రోజూ ఆ టైముకి ఇద్దరూ నిద్రపోయేవాళ్ళే.... కాని బయట గాలిచప్పుడు వినపడుతుంటే భయంపుట్టి నిద్రరాలేదు. భయంతో కళ్ళు మూసుకుని ముడుచుకు పడుకున్నారు.

ఉన్నట్టుండి బయటి జీవాలు అరవటం మొదలుపెట్టాయి.

"చలికి అరుపులు మొదలెట్టాయి. చస్తాయేమో" అన్నది నాగమ్మ కొంచెం సేపటి తర్వాత.

రాజయ్య మాట్లాడలేదు.

వర్షాకాలం వెళ్ళిపోయిందనే పశువుల పాక పడిపోయినా దాన్ని కప్పించలేదు. నీడనివ్వటానికి పక్కనే పెద్ద చింతచెట్టు వుండనే వుంది. ఇంక తొందరేమిటి? అనుకున్నాడు.

వర్షానికి, చలికి అవి అరుస్తున్నాయనే ఇద్దరూ అనుకున్నారు.

అంతేకాని బయట ఇంటిచుట్టూ నీళ్ళు ఆక్రమించుకున్నట్టు వాళ్ళకు తెలీదు.

కొంచెం దూరంలో వున్న కాలవ అప్పటికే పొంగిపోయింది. గూడెంకి ఓ అరమైలు దూరంలో వున్న చెరువుకు గండి పడింది.... ఉరుకులు పరుగులమీద వస్తున్నాయి నీళ్ళు....

"తాళ్ళు తెంచుకుపోతాయేమో" నాగమ్మ అన్నది....

"పోతేపోనీ.... లోపల జాగాయేదీ?"

"మేకలు తట్టుకోలేవు. లోపలకు లాక్కొచ్చేద్దా?"

"వూఁ"

లేచి నిల్చుంది నాగమ్మ.

తల్లిలేవగానే భయంతో పిల్లలు కూడా లేచారు. రాజయ్య వాళ్ళను దగ్గరకు తీసుకున్నాడు.

తలుపు తెరిచి వెనక్కు పడబోయింది నాగమ్మ.

"ఓర్నాయనోయ్" అరిచింది.

ఒక్కసారిగా నాగమ్మను నెట్టుకుంటూ వచ్చేసింది వరదనీరు.

అంతా అరిచారు....

గభాలున ముసిల్దాన్ని లేవనెత్తాడు రాజయ్య....

"వరద.... వరద" గొంతుచించుకు అరిచింది నాగమ్మ.

"చిన్నోడి నెత్తుకో"

"మాఁవా.... ఎల్లవేసిపోయింది.... ఇక సచ్చిపోతాం" అన్నది నాగమ్మ నీళ్ళలో నిలబడి దిక్కుతోచక....

బయటంతా తెల్లగా అగుపడులోంది.

నీళ్ళతోపాటు తాటాకు మట్టలు, ముళ్ళకంచెలు లోపలకు కొట్టుకొచ్చేయి.

నీళ్ళతాకిడికి తట్టుకోలేక ఇంటి వెనుకవైపు గోడ చప్పుడు చెయ్యకుండా కూలిపోతోంది.

గాలి వాళ్ళను వెనక్కు నెట్టేసింది.

"నడవండి.... బయటికి నడవండి... సింతసెట్టే మనల్ని కాపాడాల.... అదే మనకి దిక్కు...."

ముసిల్దాన్ని పైకెత్తి పట్టుకుని నీళ్ళను చీల్చుకుంటూ బయటకు నడిచాడు రాజయ్య....

నీళ్ళు మొకాలిలోతుపైనే ఆ ఇంటిని ఆక్రమించుకున్నాయి. గూట్లోవున్న దీపం బుడ్డిని నీరు మింగేసింది....

చీకటి....

పిల్లలు ఏడుస్తున్నారు.

గాలి వూపుకు ఇల్లు వూగుతూ వెకిలిగా నవ్వుతున్నట్లుగా సవ్వడి చేస్తోంది....

నాగమ్మ పిల్లల్ని భుజాలమీదకు ఎత్తుకుంది.

కష్టపడి ముళ్ళకంచెలను దాటుకుంటూ పక్కనేవున్న చింతచెట్టు దగ్గరకు చేరారు....

"మేకలేవీ?" అన్నాడు రాజయ్య.

"గెదెక్కడ?" అన్నది నాగమ్మ....

వాటి అరుపులు ఆగిపోవటాన్ని వాళ్ళు గమనించలేకపోయారు.

"ఓర్నాయనోయ్" మళ్ళీ కేకేసింది నాగమ్మ.

దూరంగా ఏవో నీళ్ళలో కొట్టుకుపోతున్నట్టు అస్పష్టంగా లీలగా కనపడింది.

రాజయ్యకు దుఃఖం పొంగుకు వచ్చింది. తన మూర్ఖత్వంతోనే వాటిని పోగొట్టుకున్నాడు.

గబగబా వాళ్ళందరినీ చింతచెట్టు మీదకు ఎక్కించాడు.... వాళ్ళ అదృష్టం.... ఎక్కటానికి వీలుగానే వుంది చింతచెట్టు.

జీవాలు నీళ్ళలోపడి కొట్టుకుపోయినందుకు బాధపడుతూనే వున్నారు.

ముసిల్దానికి దాదాపుగా మతిపోయింది. ఉలుకూ పలుకులేకుండా మూగదానిలా చెట్టుకొమ్మల మధ్య వుండలా చుట్టుకుపోయి కూర్చుంది. ఆమెను గట్టిగానే పట్టుకుంది నాగమ్మ.

గాలికి చెట్టు వూగుతూనే వుంది ఎవరో మొదలు పట్టుకుని అటు ఇటూ కుదుపుతున్నట్టు....

ఒక్కసారి చలికి వెన్ను జలదరించింది నాగమ్మకు.... చెయ్యి పట్టు సడలింది.

అంతే–

మూటలా నీళ్ళలోకి జారిపోయింది ముసిల్ది....

ఉన్నట్లుండి ఫెళ్ళుమన్న చప్పుడు.

చింతచెట్టు పైన పెద్దకొమ్మ విరిగిపోయింది....

అదిరిపడింది నాగమ్మ....

"మాఁవా"

రాజయ్య మాట్లాడలేదు. ఏడుస్తున్నాడు....

గూడెమంతా ఖాళీ....

అప్పటికే రాజయ్య ఇంటి గోడలు నీళ్ళ వురవడికి తట్టుకోలేక నిశ్శబ్దంగా కరిగిపోయాయి. ఇల్లు కూలిపోయింది. నీళ్ళు ఇంటి మొత్తాన్నీ లాక్కుని దూరంగా వెళ్ళిపోయాయి....

ఇల్లు కూలి నీళ్ళలో కలిసి కొట్టుకుపోతుంటే రాజయ్య చూస్తూ వుండిపోయాడు....

కళ్ళు తుడుచుకున్నాడు....

"యేడుపెందుకు మాఁవా?"

మరింత పెద్దగా యేద్చాడు....

గాలి హోరుకు ఆ చీకట్లో రాజయ్య యేడుపు చిత్రంగా వుంది....

"తుఫాను రాదన్నావుగా.... అంతా అయిపోయింది మావా.... ఈ సెట్టూ పడిపోతుంది.... మనవూ అత్తలాగానే.... మూగ జీవాల్లాగానే...."

ఆ తర్వాత ముట్లాడటానికి నాగమ్మకు మాటలు పెగల్లేదు.

ఎక్కడో వున్నట్టుండి గొల్లుమన్న యేడ్పులు, అరుపులు వినిపించాయి.

ఎవరో నీళ్ళలో కొట్టుకు వస్తున్నారు.

రాజయ్య యేడుపు ఆపలేదు.

పిల్లలు దిక్కులోచక కళ్ళు మూసుకున్నారు.

వర్షం ఎడతెరిపిలేకుండా గాలితో కలిసి చిందర వందరగా కొడుతూ వుంది.

చలికి నలుగురూ వణికిపోతున్నారు. బట్టలు తడిసి వంటికి అంటుకుపోయాయి. శరీరంమీద నించి నీళ్ళు కిందికి జారుతున్నాయి.

ఆ దుఃఖాన్ని, ఆ గుండెకోతను, ఆ బాధను, ఆ చలినీ, ఆ ప్రకృతి విలయతాండవాన్నీ భరించలేక ఒక్కసారిగా నీళ్ళలో దూకి ప్రాణాలు పోగొట్టుకోవటమే హాయిగా వుంటుందని అనుకున్నాడు రాజయ్య....

నాగమ్మకీ అట్లాగే అనిపిస్తోంది

ఎన్ని జీవాలు ఈ తుఫాను పొట్టన పడుతున్నాయో అనుకుంది.

నీటిమట్టం నిమిషనిముషానికీ పెరిగిపోతోంది.

చింతచెట్టు మానువరకూ మునిగిపోయింది.

కాలం గడుస్తోంది....

గాలి ఆగలేదు– హోరు ఆగలేదు– వర్షం ఆగలేదు. ఎడతెరిపి లేకుండా పడుతూనే వుంది–

చెట్టుమీద నలుక్కుపోయి ప్రాణాలు చేతుల్లో పెట్టుకుని, చేతులతో కొమ్మలను గట్టిగా పట్టుకుని కూర్చున్నారు.

తెల్లవార్లూ ఆ చింతచెట్టు వూగుతూనేవుంది. అక్కడి కిదగ్గర్లోనే నాలుగు పెద్ద పెద్ద చెట్లు ఒక్క వేటున నరికినట్టుగా విరిగిపడి పోయాయి.

తూరుపు తెల్లబడింది....

అప్పటికి గాలి ఉధృతం తగ్గిపోయింది. ఐనా రివ్వున ఎవరో తరుముతున్నట్టుగా గాలి పరుగులు దీస్తూనే వుంది.... కింద నీళ్ళు పారుతూనే వున్నాయి....

పరిసరాలు కనపడుతున్నాయి....

అక్కడ గుడిసె లేదు.

అసలు గూడెమే లేదు. ఎవరో ఏదో శక్తితో మాయంచేసినట్టుగా అయిపోయింది. ఒక్క ఇల్లుకూడా లేదు....

అంతా జలమయం....

చచ్చిన పశువులు - ఇతర జంతువులు చెట్లకు తగులుకుని తేలి వున్నాయి....

ముసిల్దానికోసం చూపు అనినంతమేర చూశారు–

ఉహు.... ఎక్కడా జాడలేదు.... అంతా తెల్లని తెలుపు.

ఒక్క పిట్టకూడా కనపడలేదు....

విరిగిపోయిన చెట్లకొమ్మలను చుట్టుకుని వున్నాయి పాములు....

పిల్లలు డీలాపడిపోయారు....

పొద్దు కనపడకపోయినా కడుపుల్లో ఆకలి ఎంత పొద్దు ఎక్కిందీ తెలియజేస్తూనే వుంది....

ముసిల్దానితోపాటు సర్వం పోగొట్టుకున్నందుకు ఇద్దరూ తనివి తీరా యేడ్చారు... ఇదంతా తన వల్లనే- తన మూర్ఖత్వం కారణంగానే జరిగిందంటూ మరింత ఎక్కువగా యేడ్చాడు రాజయ్య.

పొద్దెక్కుతోంది....

గాలి వూపుకూడా తగ్గిపోయింది.

క్రమంగా నీళ్ళు తగ్గిపోయాయి....

"ఆకలి.... ఆకలి" అన్నారు పిల్లలు.

"మాఁవా" అంటూ మళ్ళీ ఏడ్చింది నాగమ్మ....

ఈసారి రాజయ్య విసుక్కున్నాడు.

ఒంటిగంట దాటిపోయింది.

నీటిమట్టం కొంతమేర పూర్తిగా తీసేసింది. నేలంతా ఒండ్రుతో దిబ్బలాగా అయిపోయింది. చెట్టు దిగాడు. దిగి మిగిలిన వాళ్ళని దించాడు. దిగగానే తూర్పువైపు నుంచి వస్తున్న గూడెం మనుషులు కనిపించారు. వాళ్ళను చూడగానే రాజయ్య ప్రాణం లేచి వచ్చింది. వాళ్ళు రాగానే పెద్దగా ఏడ్చాడు.... నాగమ్మ కూడా శోకాలుపెట్టింది. శోకాలు పెడుతూనే ముసిల్ది నీళ్ళలోకి పడిపోయి కొట్టుకుపోయినట్లు చెప్పింది.

వాళ్ళంతా విచారించారు.

రాజయ్యనీ, నాగమ్మనీ ఓదార్చారు.... ఇప్పుడు అందరికీ ఆకలి ముఖ్యమైన సమస్య అయ్యింది.

ఏమీ మిగల్లేదు....

అంతా ఆహారం గురించే ఆలోచనలో పడిపోయేరు.

"గవర్నమెంటోళ్ళు తుఫాను వచ్చినప్పుడు ఇమానాల్లో వచ్చి-ఆటిల్లోవుండి అన్నం పొట్లాలు, రొట్టెలు ఇసురుతారంటగా".

"ఏమో! వూళ్ళో తిండిలేదా?"

"వూళ్ళోనా? ఎవరి దగ్గర ఏం మిగిలింది? కొంపా గోడూ సూసుకుందామని వచ్చాం.... మన గూడెంవున్న ఆనవాలే లేదు...." పూడుకు పోయిన గొంతుతో ఎవరో అన్నారు.

సరిగ్గా అప్పుడే వాళ్ళకు వున్నట్టుండి ఆకాశంలో హెలికాప్టర్ ఎగురుతున్న చప్పుడు వినిపించింది....

"ఇమానం.... అదిగో ఇమానం" అంటూ అరిచారు అంతా సంతోషంగా ఆకాశంలోకి చూస్తూ-

హెలికాప్టర్ వాళ్ళపైకి వచ్చేసింది.

వెంటనే పైనుంచి మూటలు కిందకుపడ్డాయి. కింద పడుతూనే అవి పగిలిపోయాయి. అందులోంచి అన్నం పొట్లాలు, రొట్టెలు బయటకు వచ్చాయి.

"అన్నం పొట్లాలు.... అన్నం...." జనం ఒక్కసారిగా వాటి మీదకు ఎగబడ్డారు....

కొంచెం దూరంలో నిల్చున్న రాజయ్య - నాగమ్మ పిల్లలను అక్కడే నిలబెట్టి ముందుకు పరుగుదీశారు.... వాళ్ళకు కొంచెం దూరంలోనే పొట్లాల మూట పడింది....

ఆవైపు పరుగుదీసిన నాగమ్మ ఒక్కసారిగా కూలిపోయింది. అప్పుడే పైనుండి మూట సరిగ్గా ఆమె తలమీద పడింది ... పడటంతోనే నాగమ్మ కుప్పలా కూలిపోయింది.

నిశ్చేష్టుడై శిలలా నిలబడిపోయాడు రాజయ్య ఆదృశ్యాన్ని చూస్తూనే–

అతను షాక్‌నించి తేరుకోలేదు....

కాని– పైన అక్కడే తిరుగుతూ ఎగురుతున్న హెలికాప్టర్‌లో నించి వరుసగా రెండు మూటలు సరిగ్గా అతని తలమీద ఒకదాని వెంట మరొకటి పడ్డాయి. టప్.... రాజయ్య విరుచుకు పడిపోయాడు.

పిల్లలు భయంతో కొయ్యబారిపోయారు....

తుఫాను బాధితులు ప్రభుత్వ సహాయాన్ని అందుకుంటున్నారు. భయంకరమైన తుఫాన్‌లోనే ఎంతో ప్రయాసలో ప్రాణాలు కాపాడుకున్న ఆ ఇద్దరు ఆ సహాయంతో నేలకూలిపోయారు.

*

(యువ - నవంబర్ 86)